## అపరిశుభ్రత వ్యాపారులపై జరిమానా



**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం నగరంలో మున్సిపల్ అధికారులు అపరిశుభ్రత మరియు నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపార సంస్థలపై చర్యలు చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, పరిశుభ్రత లోపం, రోడ్లపై చెత్త వేయడం వంటి ఉల్లంఘనల కారణంగా మొత్తం 11 వ్యాపార సంస్థలకు రూ.52,000 జరిమానా విధించబడింది. ఈ చర్యల్లో సుమారు 10 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం తీసుకున్నారు. మున్సిపల్ అధికారులు నగర పరిశుభ్రతను కాపాడడానికి, వ్యాపారులు నిబంధనలను పాటించడానికి పునరావృతంగా పర్యవేక్షణ చేపడతామని తెలిపారు.

## 18న జరిగే బీసీల బంద్‌కు సహకరించండి



**ఖమ్మం సిటీ, మహా:** బీసీ కులస్తులకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగే బంద్ కు సహకరించాలని కోరుతూ గురువారం బీసీ సంఘాల ప్రతినిధులు పలు రాజకీయ పార్టీల నాయకులను కలిశారు.ఈ సందర్భంగా బీజేపీ,బిఆర్ఎస్,టిడిపి, సిపిఐ, సీపీయం,ఎం ఎల్ పార్టీల నాయకులను కలిసిన వారు బంద్ కు సహకరించాలని కోరారు. బీసీల 42శాతం రిజర్వేషన్లపై కోర్టు తీర్పు కు రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు.బీసీలకు 42% శాతం రిజర్వేషన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.ఉభయ సభల్లో ను బిల్లు ఆమోదం పొందాక ఇలా జరగడం అగ్ర వర్ణాల ఆధిపత్యాన్ని చూపుతుందన్నారు.చీకట్లో గొంగడి కప్పుకొని చాటుగా రిజర్వేషన్ ఇవ్వొద్దా లేదా అని ప్రభుత్వం చూస్తుందని మండి పడ్డారు.జనాభా దామాషా ప్రకారం హక్కుగా రావాల్సిన రిజర్వేషన్లను అడ్డుకోవాలని హై కోర్టులో,సుప్రీంకోర్టులో కేసు వేశారని ఆరోపించారు. ఏది ఏమైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 18న జరిగే బంద్ విజయవంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.అనంతరం బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కురాకుల నాగభూషణం,బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వర రావు,టీడీపీ నాయకులు కేతినేని హరీష్ చంద్ర,సీపీయం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ జిల్లాకార్యదర్శి దండి సురేష్,ఎం.ఎల్. పార్టీ రాష్ట్ర నాయకులు పోటు రంగారావు మట్లాడుతూ బంద్ కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



**ముదిగొండ, మహా:** మండలపరిధిలో గంధసిరి మున్నేరు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సిఐ వద్దేపల్లి మురళి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు.అక్రమ ఇసుక ట్రాక్టర్లు పై కేసు నమోదు చేసినట్లు సిఐ మురళి తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని,చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇసుక అక్రమ దారులను సిఐ మురళి హెచ్చరించారు.గంధసిరి,పెద్దమండవ, ఆంధ్ర రాష్ట్రమైన ఎన్టీఆర్ జిల్లా మల్కాపురం ఎక్స్ రోడ్లో పోలీసులు నిఘా పెంచినట్లు ఆయన పేర్కొన్నారు.

## కెజిబివిలో ఉచిత ఆరోగ్య శిబిరం

**ముదిగొండ, మహా:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ఆరోగ్య కేంద్రం(పిహెచ్సి) ఆధ్వర్యంలో మండలపరిధిలో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కెజిబివి)లో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరం వైద్యాధికారి డాక్టర్ అంకం అరుణాదేవి మాట్లాడుతూ హాస్టల్ ఆవరణంలో నీళ్లు నిల్వ ఉంచరాదన్నారు.సీజనల్గా వచ్చే వ్యాధుల పట్ల బాలికలు జాగ్రత్తలు తీసుకొని,ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు.అనారోగ్య సమస్యలుంటే పిహెచ్సికి రావాలన్నారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు,పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందే వరకు,శరీరంలో ప్రధానమైన అవయవాలకు రక్త ప్రసరణ కొనసాగించడంలో సిపిఆర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.సిపిఆర్ గురించి బాలికలకు డాక్టర్ అరుణాదేవి అవగాహన కల్పించారు.

# ఖాళీ గోదాములు... ఖాళీ జేబులు!

**ఖమ్మం బ్యూరో, మహా:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఖమ్మం జిల్లా వేర్‌హౌసింగ్ గోదాముల ఉద్యోగ నియామకాలు తీవ్ర నిరాశను, ఆగ్రహాన్ని మిగిల్చాయి. అర్హతలు, నిబంధనలను పక్కనపెట్టి, కేవలం అధికార పార్టీకి చెందిన పలుకుబడి ఉన్నవారికి మాత్రమే ఔట్‌సోర్సింగ్ పోస్టులు కట్టబెట్టారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ నియామకాల వెనుక జిల్లా స్థాయి అధికారులు, ఓ మంత్రి అనుచరుడి పాత్ర ఉందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. న్యాయం కోసం వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులను ఆశ్రయించిన బాధితులు, తక్షణ చర్యలు తీసుకోకపోతే హైకోర్టులో పోరాడతామని హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలోని వేర్‌హౌసింగ్ గోదాముల్లో ఉద్యోగ నియామకాలపై భారీ అవినీతి ఆరోపణలు రావడంతో జిల్లాలో కలకలం మొదలైంది. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి విద్యార్హతలు లేని వ్యక్తులను కీలకమైన ఔట్‌సోర్సింగ్ స్థానాల్లో నియమించారని నిరుద్యోగులు మరియు స్థానిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, నేలకొండపల్లి గోదాముల్లో జరిగిన ఈ నియామకాల్లో, అధికార పార్టీకి చెందిన కొంతమంది సోషల్ మీడియా కార్యకర్తలకు కేంద్ర స్థానాల్లో ఉద్యోగాలు ఇచ్చారని సోషల్ మీడియా ద్వారా సమాచారం బయటకు వచ్చింది. ఈ నియామకాలు వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్‌కు కూడా తెలియకుండా దానే, జిల్లా అధికారులు రహస్యంగా పూర్తి చేశారని చెబుతున్నారు. సరైన విద్యార్హతలు కలిగి, ఉద్యోగాల కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేశాం. కానీ మా దరఖాస్తులు పక్కనపెట్టి, రాజకీయ పలుకుబడి ఉన్న అర్హతలేని వారినే నియమించారు. ఇది చదువుకున్న నిరుద్యోగులను మోసం చేయడమే," అని ఉద్యోగాలు దక్కని యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలను ఉల్లంఘిస్తూ జరుగుతున్న ఇలాంటి నియామకాలను ప్రభుత్వం ఎలా అనుమతిస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు.

### మంత్రి అనుచరుడిపై ఆరోపణలు

ఈ అక్రమ నియామకాల వెనుక భారీగా డబ్బు చేతులు మారిందని, జిల్లాకు చెందిన ఓ కీలక మంత్రి ముఖ్య అనుచరుడు తెర వెనుక పాత్ర పోషించినట్టు గట్టి అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. అవినీతికి పాల్పడిన అధికారులు, దళారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, నిరుద్యోగుల తరపున డిమాండ్‌లు వస్తున్నాయి.

### ఎండీకి ఫిర్యాదు, హైకోర్టుకు వెళ్తాంలి

ఈ అన్యాయంపై పోరాడాలని నిర్ణయించుకున్న బాధితులు, తమ ఫిర్యాదుపై వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ను కలిసి తక్షణమే విచారణ జరపాలని కోరారు. తమకు వెంటనే న్యాయం జరగకపోతే, ఈ సమస్యను హైకోర్టులో ప్రస్తావించి న్యాయపరంగా పరిష్కారం కోసం పోరాడుతామని నిరుద్యోగులు హెచ్చరించారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, అర్హత కలిగినవారి హక్కుల పరిరక్షణ అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## వ్యాధి నిరోధకతకు పోషకాహారం

**కారేపల్లి, మహా :** వ్యాధి నిరోధకతను పెంచుకోవటానికి పోషకాహారం అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాబాయి అన్నారు. గురువారం కారేపల్లి మండలం గాంధీనగర్ అంగన్‌వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని జరిపారు. పోషకాహారం లభించే కూరగాయాలు, ఇంటి వద్ద లభించే వస్తువులతో తయారి చేసిన పదార్ధాలను ప్రదర్శించారు. మునగాకు, కరివేపాకు పొడిని తయారు చేసే విధానాన్ని వివరించారు. గ్రామంలో పోషకాహార ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ గీతాబాయి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు తీసుకోవలసిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఏడు నెలల నుండి పిల్లలకు ఏ విధమైన ఆహారం తినిపించాలనే అంశంపై వివరించారు. మూడు సంవత్సరాలు దాటిన పిల్లలకు అంగన్వాడీ కేంద్రం ద్వారా బాలమృతం అందజేశారని ఇది బహుళార్ధ ప్రయోజనకారి అని అన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు లబ్దిదారులు పాల్గొన్నారు.





## అశోక్‌నగర్‌లో కార్డెన్ సర్చ్

**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిధిలోని అశోక్‌నగర్ ప్రాంతంలో డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు కార్డెన్ సర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చేపట్టిన తనిఖీల్లో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి తో పాటు అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి, ఇ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై నగేష్‌లు పాల్గొన్నారు. తనిఖీల అనంతరం డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా ఆకస్మిక సోదాలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో 58 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, ఒక ట్రాలీ వాహనంకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. బెల్ట్ షాపులు నడిపే నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు నమోదు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమాజ శాంతి భద్రతకు భంగం కలిగించే కార్యకలాపాలను అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీఎస్పీ స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.